ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
సోమవారం 4 మార్చి 2024





చోరీ కేసులో సినీనటి సౌమ్యశెట్టి అరెస్టు


- స్నేహితురాలి ఇంట్లోకి వెళ్లి బంగారం చోరీ
- 57 తులాలు రికవరీ చేసిన విశాఖ పోలీసులు

- వార్త మెయిన్‌లో..

తాగునీటి కష్టాలు తప్పవా ?

ఈ ఏడాది అమలుకాని సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్

- వేసవి ప్రణాళిక అమలుకు ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు
- మరమ్మతులకు నోచుకోని రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు



రాంబిల్లిలో మరమ్మతులకు గురైన మంచినీటి బోరు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఈ వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవా?. వేసవి దృష్ట్యా అధికారులు ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోలేదా?.. అంటే అవుననే సమాధానం వస్తోంది. వాస్తవానికి ఏటా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 45 రోజులపాటు సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ నిర్వహించి గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల నిర్వహణ, తాగునీటి బోర్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. అయితే ఈ ఏడాది గ్రామీణ నీటి సరఫరా శాఖాధికారులు ఎటువంటి ముందస్తు ప్రణాళిక అమలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వేసవికి ముందే జిల్లాలో ప్రజలకు ఎక్కడా తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 45 రోజుల పాటు ప్రత్యేక ప్రణాళిక అమలు చేసి గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల స్థితిగతులు, తాగునీటి బోర్ల మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంది. ప్రత్యేక మొబైల్ వాహనాలను మండల అభివృద్ధి అధికారి ఆధీనంలో ఉంచి ఆయా మండలాల్లో రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి బోర్లు, కుళాయిల స్థితిగతులను తెలుసుకొని నీటి ఎద్దడి రాకుండా అవసరమైన మరమ్మతు పనులు చేపట్టాలి. కానీ ఈ ఏడాది మార్చి నెల వచ్చినా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ ఊసెత్తలేదు. దీనికి కారణం నిధుల కొరతేనని తెలుస్తోంది. జిల్లా అధికారులు ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ నిర్వహించేందుకు రూ.80 లక్షలు అవసరమని ప్రభుత్వానికి మూడు నెలల కిందటే ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాలేదని తెలిసింది. దీంతో అధికారులు వేసవికి ముందు చేపట్టాల్సిన ముందస్తు ప్రణాళిక అమలు చేయలేదని సమాచారం. జిల్లాలో 29 రక్షిత నీటి పథకాలు, 15,764 చేతిబోర్లు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు జరుగుతున్నందున జిల్లాలో అన్ని మండలాల్లో తాగునీటి సరఫరా జరుగుతోందని అధికారుల నివేదికలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కొన్నిచోట్ల పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతుండగా యంత్రాంగం సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పనుల్లో బిజీగా ఉంది. వేసవిలో ప్రతి ఏడాది దేవరాపల్లి, రావికమతం, రోలుగుంట, నాతవరం, గొలుగొండ మండలాల్లోని మారుమూల గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి తీవ్ర నీటి ఎద్దడి నెలకొనే పరిస్థితులు ఉన్నాయి. జిల్లాలో నీటి ఎద్దడి ఇబ్బందులను అధిగమించేందుకు యంత్రాంగం ఇప్పుడు అప్రమత్తం కాకపోతే వేసవిలో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వేసవి సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్ అమలు చేయకపోవడంపై ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి శివానంద్‌ను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా ప్రత్యేక ప్రణాళిక ఏమీ అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం 29 రక్షిత ... మిగతా 6వ పేజీలో



మహా పాదయాత్రలో పాల్గొన్న కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, ఉక్కు ఉద్యోగులు

కదంతొక్కిన ఉక్కు కార్మికులు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహా పాదయాత్ర

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు కార్మికులు ఆదివారం విశాఖలో కదం తొక్కారు. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం నుంచి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో మహా పాదయాత్రను నిర్వహించారు.

- వార్త 7వ పేజీలో..

ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల విలీనం ?

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి

- ఉమ్మడి జిల్లాలో 342 కేంద్రాల గుర్తింపు
- నేటి నుంచి ఎన్‌సీఈఆర్‌టీ బృందం పర్యటన
- వసతులు, ఇతర అంశాలపై పరిశీలన

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):

కేంద్రం రూపొందించిన నూతన విద్యా విధానం అమల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాల విలీనం కోసం విస్తృతస్థాయి కసరత్తు జరుగుతోంది. ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలున్న వాటిని ముందుగా గుర్తించి విలీనం చేయనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం సమీపంలోని కేంద్రాలను కూడా విలీనం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.



విశాఖలో ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నది ఇక్కడే..

ఉమ్మడి విశాఖ జిల్లాలో 342 చోట్ల ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ముందుగా వీటన్నింటినీ విలీనం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇది ముగిసిన తరువాత దగ్గరగా ఉన్న వాటిని విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. నూతన విద్యావిధానంలో భాగంగా రెండేళ్ల క్రితమే ఉన్నత పాఠశాలకు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు, నాలుగు, ఐదు తరగతులను విలీనం చేశారు. దీంతో ఆయా ఉన్నత పాఠశాలల్లో మూడు నుంచి పది వరకు తరగతుల బోధన జరుగుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా రేషనలైజేషన్ చేసి ప్రాథమిక పాఠశాలల్లో మిగులు టీచర్లను ఉన్నత పాఠశాలలకు పంపారు. ప్రస్తుతం మూడు నుంచి ఐదు తరగతులకు సబ్జెక్టు టీచర్లు బోధిస్తున్నారు. ఉన్నత పాఠశాలలకు కిలోమీటరు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో మూడు నుంచి ఐదు తరగతుల విలీనం నేపథ్యంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. ఈ విలీనంపై సర్వత్రా వ్యతిరేకత వెల్లువెత్తినా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొండిగా వ్యవహరించిందన్న ఆరోపణలున్నాయి.

పునాది పాఠశాలలుగా మార్పు

ఇదిలావుండగా రానున్న విద్యా సంవత్సరం నుంచి ఒకే ప్రాంగణంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీ కేంద్రాలను విలీనం చేయనున్నారు. వీటిని పునాది పాఠశాలలు (ఫౌండేషన్ స్కూళ్లు) అని పిలుస్తారు. మూడేళ్ల నుంచి ఎనిమిదేళ్ల వయసు మధ్య ఉండే బాల బాలికలు ఈ పాఠశాలల్లో చదువుతారు. ప్రీకేజీ నుంచి రెండో తరగతి వరకు విద్యార్థులకు అందించే బోధనను పూర్వ ప్రాథమిక విద్యగా వ్యవహరిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల విలీనం నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో వసతులు ఉన్నాయా? భద్రతా ప్రమాణాలు, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వం వివరాలు కోరుతోంది. ఈ మేరకు నేషనల్ కరికులమ్ ఫ్రేమ్‌వర్క్ స్టేజ్ 1లో భాగంగా పునాది స్కూళ్లు ప్రారంభించే ... మిగతా 6వ పేజీలో

సీఎం జగన్ రాక రేపు



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల ఐదోతేదీన విశాఖలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 9.40 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి 10.30 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45కు రుషికొండలోని ఐటీ హిల్ నంబరు -3లో ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకుని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు ఉదయం 11 గంటలకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12.30 గంటల వరకు విజన్ వైజాగ్ లోగో ఆవిష్కరణ, పారిశ్రామికవేత్తల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గంలో పీఎంపాలెంలోని వి కన్వెన్షన్ హాల్‌కు 12.45 గంటలకు చేరుకుని, 'కేస్కడింగ్ స్కిల్స్-పేరిడియం భగవత' సదస్సును ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1.50 గంటలకు తిరిగి రుషికొండ హిల్ నంబరు-3కి చేరుకుని హెలికాప్టర్‌లో ఎయిర్‌పోర్టుకు చేరుతారు. 2.30 గంటలకు విమానంలో గన్నవరం బయలుదేరి వెళతారు.

ఎందుకీ వివక్ష

టర్నోవర్‌లో అగ్రస్థానంలో బుచ్చెయ్యపేట పీఏసీఎస్

- మండలంలో మిగతా ఐదు పీఏసీఎస్‌ల కంటే మెరుగైన పురోగతి
- అయినా పట్టించుకోని పాలకులు
- భవనం శిథిలావస్థకు చేరినా చర్యలు శూన్యం
- మిగతా పీఏసీఎస్‌లకు నూతన భవనాలు నిర్మించి దీనిని మాత్రం విస్మరించిన వైనం
- పెచ్చులూడుతున్న శ్లాబ్
- వర్షమొస్తే రికార్డులు, ఎరువులు తడిసిపోతుండడంతో సిబ్బంది ఇబ్బందులు



పెచ్చులూడిన శ్లాబ్



శిథిలావస్థకు చేరిన బుచ్చెయ్యపేట పీఏసీఎస్ భవనం

బుచ్చెయ్యపేట, మార్చి 3:

బుచ్చెయ్యపేట పీఏసీఎస్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం శ్లాబ్ పెచ్చులూడి పోయి వర్షాకాలంలో భవనం మొత్తం కారిపోతోంది. మండలంలో మొత్తం ఆరు పీఏసీఎస్‌లు ఉండగా, టర్నోవర్‌లో మొదటి స్థానంలో నిలిచిన బుచ్చెయ్యపేట పీఏసీఎస్ భవనం దెబ్బతిన్నా పాలకులు పట్టించుకోకపోవడంతో సభ్య రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బుచ్చెయ్యపేట పీఏసీఎస్‌ను 1963లో ఏర్పాటు చేశారు. బుచ్చెయ్యపేట, పోలేపల్లి, కందిపూడి, దిబ్బిడి, పి.భీమవరం, కొండెంపూడి, కేపీ.అగ్రహారం, కొండపాలెం, పెదమదీనా, ఐతంపూడి, చినమదీనా గ్రామాలకు చెందిన 4,300 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. సుమారు రూ.5 కోట్లు 50 లక్షల టర్నోవర్‌తో, రూ.కోటిన్నర లాభంతో, అధిక సభ్య రైతులతో మండలంలో మిగతా ఐదు పీఏసీఎస్‌ల టర్నోవర్ కంటే బుచ్చెయ్యపేట పీఏసీఎస్ మొదటి స్థానంలో నిలుస్తుంది. 1983లో 47 సెంట్ల భూమిని పాతాళ జగ్గయ్య, సోమయ్యలు వితరణగా తమ జిరాయితీ భూమిని పీఏసీఎస్ భవన నిర్మాణానికి ఇవ్వడంతో భవన నిర్మాణం చేపట్టారు. అయితే భవన నిర్మాణ పనులు లోపభూయిష్టంగా జరగడంతో నిర్మించిన 12 సంవత్సరాలకే పీఏసీఎస్ భవనం దెబ్బతింది. భవనం మొత్తం శ్లాబ్ పెచ్చులూడిపోవడంతో దశాబ్దన్నర కాలంగా భవనం కారిపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. వర్షం పడితే కార్యాలయంలో పనిచేసున్న సిబ్బందికి దడే. రికార్డులు, గోదాములో రసాయనిక ఎరువులు తడిసిపోకుండా కాపాడుకోవడానికి సిబ్బంది నానా అవస్థలు పడుతుంటారు. భవనం శ్లాబ్ పెచ్చులు సిబ్బందిపై పడడంతో వారు గాయాలపాలవుతున్నారు. భయాందోళనల మధ్య విధులు నిర్వహించాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనంలో అధ్యక్ష గది మరీ చిన్నదిగా ఉండడంతో సమావేశాల నిర్వహణకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వడ్డాది, విజయరామరాజుపేట, తురకలపూడి, పొట్టిదొరపాలెం, బంగారుమెట్ట పీఏసీఎస్‌లకు నూతన భవనాలను నిర్మించిన డీసీసీబీ అధికారులు బుచ్చెయ్యపేటకి నూతన భవ నాన్ని మంజూరు చేయకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. గత డీసీసీబీ చైర్మన్ సుకుమార్‌వర్మ బుచ్చెయ్యపేట పీఏసీఎస్‌కి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ కాగితాలకే పరిమితం కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో మిగతా పీఏసీఎస్‌ల కంటే ... మిగతా 6వ పేజీలో



కొట్నివీధి యూపీహెచ్‌ఎస్‌లో చిన్నారికి చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

పల్స్ పోలియోకు విశేష స్పందన

అనకాపల్లి టౌన్/అనకాపల్లి రూరల్, మార్చి 3: జిల్లాలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లాలోని 54 పీహెచ్‌సీల పరిధిలో 1409 బూత్‌లను డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ హేమంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. జిల్లాలో లక్షా 97వేల 701 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి లక్ష్యం కాగా, 1,88,524 (95.36 శాతం) మందికి పోలియో చుక్కలు వేశారు. అనకాపల్లిలోని కొట్నివీధి యూపీహెచ్‌ఎస్‌లో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శాంతిప్రభ, అదే సెంటర్‌లో డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని వైద్యాధికారులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

మాకవరపాలెం, మార్చి 3:

జిల్లాలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలు ఇద్దరు మృతి చెందారు. మాకవరపాలెం మండలంలో ఓ వ్యక్తి, గొలుగొండ మండలంలో ఓ వృద్ధుడు ప్రమాదానికి గురై దుర్మరణం చెందారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి.



లంక నారాయణరావు (ఫైల్ ఫొటో)



దుంగల అప్పలనాయుడు (ఫైల్)

మాకవరపాలెం మండలం గిడుతూరు గ్రామానికి చెందిన లంక నారాయణ రావు(30) బొడ్డేపల్లిలో ఆటో మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం షాపు తెరిచి సాయంత్రం ఆరున్నర గంటలకు మూసివేసి తన బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. రాత్రి ఏడు గంటల సమయంలో శ్రీరామపురం గ్రామం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. దీంతో అతను తూలి దూరంగా పడిపోవడంతో తలకు బలమైన గాయం తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ దూరంగా రోడ్డుపై దొర్లడంతో మంటలు చెలరేగి దగ్ధమైంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

గొలుగొండ మండలంలో వృద్ధుడు..

కృష్ణాదేవిపేట: రోడ్డు ప్రమాదంలో గొలుగొండ మండలం ఏఎల్‌పురం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు మృతి ... మిగతా 6వ పేజీలో

పాఠశాల అప్‌గ్రేడ్ ఆశలు ఆవిరి!

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని 2019లో ప్రతిపాదనలు

- అప్పట్లో ఎన్నికలు రావడంతో బ్రేక్
- వైసీపీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోని వైనం
- విద్యార్థుల్లో నిరాశ

నర్సీపట్నం, మార్చి 3:

పెదబొడ్డేపల్లిలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అవుతుందన్న ఆశలు అడియాశలు అయ్యాయి. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత ఐదేళ్లుగా జూనియర్ కళాశాల ప్రతిపాదనలు నిలిచిపోయాయి.



పెదబొడ్డేపల్లిలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్

నర్సీపట్నం ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలురు)ను 1983 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు మంజూరు చేశారు. అయ్యన్నపాత్రుడు చొరవతో పెదబొడ్డేపల్లిలో మెయిన్ రోడ్డును అనుకొని 15 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్కూల్ ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు ఐదు నుంచి పది తరగతుల వరకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రతీ ఏటా ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లు భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఇక్కడ 5 నుంచి 10 తరగతి వరకు 456 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలలో స్థిరపడ్డారు. ఇక్కడ పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుకోవడానికి అత్యధికంగా ప్రైవేటు జూనియర్ కళాశాలలో చేరుతున్నారు. ఈ స్కూల్‌ను రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తే ఇంటర్ చదువుకోవడానికి విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన అవసరం ఉండదని, ఆర్థికంగా వెసులుబాటు లభిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. దీని వల్ల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ప్రైవేటు కళాశాలలో హాస్టల్ ఉండి ఇంటర్ ... మిగతా 6వ పేజీలో

అధికారంలోకి రాగానే పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్ఠం చేస్తాం

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ



డిక్లరేషన్ ఫారాలు అందజేస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

కొత్తూరు, మార్చి 3 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్ఠం చేస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద అన్నారు. ఆదివారం కూండ్రం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. పంచాయతీలకు అత్యధిక నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సర్పంచ్ నందారపు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జెట్టి సత్యవతిలకు డిక్లరేషన్ ఫారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చికూర రాము, నందారపు సూరిబాబు, జెట్టి అప్పారావు, మరపురెడ్డి సత్యనారాయణ, సేనాపతి గణపతి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హాస్యవల్లరి



హాస్యవల్లరిలో సన్నివేశం

అనకాపల్లి టౌన్, మార్చి 3 : స్థానిక వైఎంవీఏ హాల్‌లో ఆదివారం రాత్రి లాఫింగ్ క్లబ్ కార్యక్రమం అత్యంత హాస్యభరితంగా సాగింది. విజయబాబు మాస్టారు ఈల పాటతో అలరించారు. విశాఖపట్నంకు చెందిన హాస్యప్రియ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో కళాకారులు చేసిన హాస్యామృతం కామెడీ షో అత్యంత రమణీయంగా సాగింది. కళాకారులకు అతిథులు కొణతాల ఫణిభూషణ్‌శ్రీధర్, కర్రి సన్యాసినాయుడు చేతుల మీదుగా చిరు సత్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో లాఫింగ్ క్లబ్ ప్రతినిధులు దాడి వాసు, మురళీ, వినకోట బుచ్చిరాజు, దాడి సూరిబాబు, బొడ్డేడ రాజేష్, బుద్ధ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారను.

టెన్త్ విద్యార్థులతో విజయ హోమం



విజహోమం కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

రాంబిల్లి, మార్చి 3: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరుతూ భగవత్ భక్తి ప్రచార ట్రస్టు ఆధ్వర్యంలో పంచదార్లలోని ద్విముఖ వినాయకుని ఆలయంలో ఆదివారం విజయహోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు బి. లక్ష్మీనారాయణ విద్యార్థులతో పూజలు, హోమం చేయించారు. స్వామివారి సన్నిధిలో పూజ చేసిన పెన్‌లు, విభూది, విజయ కంకణం, అక్షింతలు, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భగవత్ భక్తిప్రచార ట్రస్టు కార్యదర్శి బి.శ్రీరామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీసీటీ హైస్కూల్ ఉపాధ్యాయులు మురళీ మోహన్, సామాజిక కార్యకర్తలు ఎస్‌వీ.రమణ, నాగేశ్వరరావు రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి, మునగపాక, మండలాల్లోని హైస్కూళ్లకు చెందిన 360 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ బాల సూర్యారావు

పరవాడ, మార్చి 3 : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరవాడ సీఐ బాలసూర్యారావు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన తాడి, చినతాడి, తాడి బీసీ కాలనీలో పర్యటించారు. అనంతరం స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కొట్లాట్లలు, తగాదాలు పడొద్దన్నారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. అనుమానాస్పదంగా గ్రామాల్లో ఎవరైనా సంచరించినట్టయితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిటీ కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వాచ్‌మన్ మృతి

చోడవరం, మార్చి 3 : పట్టణ శివారు కొత్తూరు జంక్షన్ సమీపంలో గల మద్యం దుకాణం వద్ద వాచ్‌మేన్‌గా పనిచేస్తున్న ఎడ్లవీధికి చెందిన సిరసపల్లి వెంకటరావు ఆదివారం మృతిచెందారు. శనివారం రాత్రి మద్యం దుకాణం వద్ద విధులకు వెళ్లిన ఆయన తెల్లవారు జామున విధులలో ఉండగానే గుండెపోటుతో కన్నుమూశారు. ఇతనికి భార్య కుమార్తె ఉన్నారు.

పల్స్ పోలియోకు విశేష స్పందన



కోట్నివీధిలో చిన్నారికి చుక్కలు వేస్తున్న నోడల్ అధికారి డాక్టర్ శాంతిప్రభ



అచ్యుతాపురం జంక్షన్‌లో పోలియో చుక్కలు వేస్తున్న సుకుమార వర్మ

అనకాపల్లి టౌన్, మార్చి 3 : పట్టణంలో పల్స్‌పోలియో కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణ పరిధిలోని 47 బూత్‌లను ఏర్పాటు చేశారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్టాప్‌ల్లో చిన్నారులకు వైద్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. కోట్నివీధి రామాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ లూసీ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లిలో 10,635 మంది చిన్నారులు ఉండగా 10,209 మందికి పోలియో చుక్కలు వేసినట్టు డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు తెలిపారు. 95.9 లక్ష్యం చేరామని, సోమ, మంగళవారాల్లో మిగిలిన చిన్నారులకు కూడా పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరవాడలో..

మండలంలోని దేశపాత్రునిపాలెంలో ఆదివారం చిన్నారులకు జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పోలియో చుక్కలను వేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు లక్కరాజు సంజీవమ్మ, ఏఎన్ఎం రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పరవాడ పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారిణి డాక్టర్ హారిక పర్యవేక్షణలో 95 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలో 96 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారి కనకఅప్పారావు తెలిపారు.

పాయకరావుపేటలో..

పాయకరావుపేట పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం చిన్నారులకు 99 శాతం మేరకు పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారి డాక్టర్ డి.సుభాష్ తెలిపారు. సోమవారం నుంచి రెండ్రోజులపాటు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి మిగిలిన పిల్లలకు పోలియో చుక్కలు వేసి వంద శాతం పూర్తిచేస్తామన్నారు.

ఎలమంచిలిలో..

ఎలమంచిలి మునిసిపాలిటీలోని లైనుకొత్తూరులో ఎంపీపీ బోదెపు గోవింద్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆదేవిధంగా ఏటికొప్పాకలో జడ్పీటీసీ సభ్యురాలు శానాపతి సంధ్యారాణి, పెదపల్లిలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, నేతలు దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాధ్, శానాపతి రాము, దాసరి గణేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని పెంటకోటలో ఆదివారం చిన్నారులకు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు పోలియో చుక్కలు వేశారు. మంగవరం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలలో 96 శాతం పోలియో చుక్కలు వేసినట్టు వైద్యులు సంకీర్తన, స్వరాజ్యం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో పి.రాముడు, ఎంపీహెచ్ఎస్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మండలంలోని సుంకపూర్ పాఠశాలలో ఆదివారం చిన్నారులకు ఎంపీడీవో కాశీవిశ్వనాథం పోలియో చుక్కలు వేశారు. మండల వ్యాప్తంగా 2009 పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యం కాగా 2,267మంది పిల్లలకు వేసినట్టు కె.వెంకటాపురం పీహెచ్‌సీ డాక్టర్ సంతోష్‌కుమార్ తెలిపారు. బీకేపల్లిలో ఎంపీటీసీ సభ్యుడు పెట్ల రాంబాబు, సర్పంచ్ పెట్ల లింగంనాయుడు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీహెచ్‌వో గోవిందరావు పాల్గొన్నారు.



చినగుమ్ములూరులో పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, పక్కనే సర్పంచ్ అప్పలనరసింహ

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధిలో 99.5 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పీహెచ్‌సీ పరిధిలో 5,113 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 5,102 మందికి వేశారు. అచ్యుతాపురం జంక్షన్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. బస్సులు, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్న పిల్లలకు కూడా పోలియో చుక్కలు వేశారు. చోడపల్లి బూత్‌ని ఏడీఎంహెచ్ఓ బాలాజీ సందర్శించారు. కార్యక్రమాల్లో వైద్యాధికారిణి శ్రావణి పాల్గొన్నారు.

సబ్బవరంలో..

మండలంలోని గుల్లేపల్లి, సబ్బవరం పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం 98 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు సబ్బవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ చక్రవర్తి తెలిపారు. గుల్లేపల్లిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండల వ్యాప్తంగా 4,780 మంది చిన్నారులుండగా 4,684 మందికి పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లిలో...

నక్కపల్లి మండలం గొడిచెర్ల పీహెచ్‌సీ పరిధిలోని గుల్లిపాడులో ఆదివారం రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పోలియో చుక్కలు వేశారు. సాయంత్రం 5 గంటల వరకూ 90 శాతం మేర పోలియో చుక్కలు వేశారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పెనుగొల్లు, సర్వసిద్ధి పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చినగుమ్ములూరులో జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి, సర్పంచ్ గాడి అప్పలనరసింహ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ధర్మవరం అగ్రహారంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రెండు పీహెచ్‌సీల వైద్యాధికారిణిలు శక్తిప్రియ, వాసంతి, రాజేశ్వరి పోలియో శిబిరాలను పరిశీలించారు.

కశింకోటలో..

స్థానిక కశింకోట, తాళ్లపాలెం పీహెచ్‌సీల పరిధిలో 93.96 శాతం పోలియో చుక్కలు వేశారు. కశింకోటలో ఎంపీపీ కలగ లక్ష్మి, సర్పంచ్ జయరజిని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కశింకోట పీహెచ్‌సీ పరిధిలో 6,250 మంది పిల్లలకు గానూ 5,873 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారులు తిరుపతిరావు, యశోద తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతి ప్రభ, వైద్య సిబ్బంది సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి, దిమిలి పీహెచ్‌సీల పరిధిలో ఆదివారం చిన్నారులకు 95 శాతం పోలియో చుక్కలు వేసినట్టు వైద్యులు అనీల్‌కుమార్, ఆర్.వెంకటేష్, ఎస్‌పీజీ శ్రావణి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు పీహెచ్‌సీల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పెంటకోటలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న చిక్కాల రామారావు



ఎలమంచిలి లైనుకొత్తూరులో చిన్నారికి పోలియో వ్యాక్సిన్ వేస్తున్న ఎంపీపీ గోవింద్

అనకాపల్లి, తుమ్మపాలల్లో కేంద్ర బలగాలు కవాతు



అనకాపల్లిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు



తుమ్మపాలలో కవాతు నిర్వహిస్తున్న పోలీస్ బలగాలు

అనకాపల్లి టౌన్, మార్చి 3 : రానున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆదివారం సాయంత్రం పట్టణంలోని విజయరామరాజుపేట, గాంధీనగరం, శ్రీరామనగర్‌కాలనీ, లక్ష్మీదేవిపేట, గూడ్స్‌రోడ్డు, వేల్పులవీధిల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు కవాతును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అధికారులతోపాటు పట్టణ సీఐ జి. శంకరరావు, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాలలో.

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం తుమ్మపాలలో సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అమిత్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. తుమ్మపాల ఏలేరు కాలువ నుంచి మెయిన్‌రోడ్డుతోపాటు పురవీధుల్లో కవాతు సాగింది. ఈ సందర్భంగా అమిత్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. సెంట్రల్ ఆర్మీ, పోలీస్ ఫోర్స్ భద్రతా ఓటర్లకు నిత్యం ఉంటుందన్నారు. ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల అప్‌గ్రేడ్ ఆశలు ఆవిరి!

... 5వ పేజీ తరువాయి

చదువుకోవాలంటే రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అంటున్నారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు విశాలమైన క్రీడా ప్రాంగణం ఉంది. అలాగే అదనపు తరగతి గదులు నిర్మించడానికి వీలు కూడా ఉంది. ఇది జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ కావడానికి అన్ని సదుపాయాలు ఉన్నాయి.

2019లో టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు 2019లో ఏపీ రెసిడెన్సియల్ స్కూల్‌ను ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారు. అయితే అప్పట్లో ఎన్నికలు రావడంతో అది కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. దీని వల్ల కళాశాలగా అప్‌గ్రేడ్ కావలసిన రెసిడెన్సియల్ పాఠశాల ఎటువంటి పురోగతి లేకుండా ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

చెందాడు. దీనికి సంబంధించి కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపిన వివరాలిలావున్నాయి. ఏఎల్‌పురం గ్రామానికి చెందిన దుంగల అప్పలనాయుడు(70) శనివారం రాత్రి కొండగోకిరిలో గల చేనుపాకల నుంచి తన పనులు ముగించుకుని గ్రామానికి నడిచి వస్తుండగా ఇదే మార్గంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న అదే గ్రామానికి చెందిన మువ్వల సింహాద్రి ఢీకొన్నాడు. దీంతో అప్పలనాయుడు తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సింహాద్రికి పలుచోట్ల గాయాలయ్యాయి. వారిద్దర్నీ నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పలనాయుడు పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను ఆదివారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు చినఅప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు.

తాగునీటి కష్టాలు తప్పవా?

... 5వ పేజీ తరువాయి

మంచినీటి పథకాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెలలో జిల్లాలోని అన్ని మండలాల్లో తాగునీటి వనరుల పరిస్థితిని తెలుసుకొని, అవసరం మేరకు రక్షిత నీటిపథకాలకు,బోర్లకు మరమ్మతులు చేపడతామని ఆయన వెల్లడించారు.

మూలకు చేరిన మంచినీటి బోరు

రాంబిల్లి: మండలంలోని కొండవారపాలెంలో మంచినీటి బోరు మరమ్మతులకు గురై ఏడాది గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్థులకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి బోరుకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల విలీనం?

... 5వ పేజీ తరువాయి

క్రమంలో ఎంపికచేసిన పాఠశాలలను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) బృందం పరిశీలించనుంది. ఈ బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. సోమవారం నుంచి విశాఖ జిల్లాలోని పది మండలాల్లో ఒక్కో పూర్వప్రాథమిక పాఠశాలను సందర్శించనుంది. ఆయా పాఠశాలల్లో వసతులు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలను బృంద సభ్యులు తనిఖీ చేయనున్నారు.

ఎందుకీ వివక్ష

... 5వ పేజీ తరువాయి

అన్నింటా ముందంజలో ఉన్న బుచ్చెయ్యపేట పీఏసీఎస్‌కి మౌలిక సదుపాయాల కల్పనలో డీసీసీబీ అధికారులు వివక్ష చూపడాన్ని రైతులు ఆక్షేపిస్తున్నారు. కావాలనే బుచ్చెయ్యపేట పీఏసీఎస్‌కి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా దెబ్బతిన్న భవనంలో పీఏసీఎస్ కొనసాగించడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సొంత స్థలం ఉండి కూడా నూతన భవనాన్ని ఎందుకు నిర్మించడం లేదో తెలపాలని రైతులు డీసీసీబీ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుచ్చెయ్యపేట పీఏసీఎస్‌కి నూతన భవనం మంజూరుకు కృషి చేయాలని సభ్య రైతులు కోరుతున్నారు.

దోసలపాడులో ఆంజనేయస్వామి ఉత్సవం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న అనిత

నక్కపల్లి, మార్చి 3: మండలంలోని దోసలపాడులో ఆదివారం అంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారి ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, కురందాసు నూకరాజు, వైబోయిన రమణ, కొప్పిశెట్టి బుజ్జి, గింజాల లక్ష్మణరావు తదితరులు ఆలయాన్ని దర్శించుకున్నారు.

సీఎం సభా ప్రాంగణాన్ని పరిశీలించిన జేసీ



సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న జేసీ, ఎమ్మెల్సీ రఘురాం

కొత్తూరు, మార్చి 3 : ఈనెల 7న అనకాపల్లి మండలం పిసినికాడలో జరగనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలసిల రఘురాం ఆదివారం పరిశీలించారు. నాలుగో విడత చేయూత కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రారంభిస్తారని, అందులో భాగంగా పర్యటన ఏర్పాట్లను వారు పరిశీలించారు. వారి వెంట వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి వైసీపీ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్, సర్పంచ్ రమేష్ తదితరులున్నారు.

గణపతి దుర్గామల్లేశ్వరిస్వామి ఆలయం ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న సురేంద్ర

అనకాపల్లి టౌన్, మార్చి 3 : స్థానిక లక్ష్మీదేవిపేట శివారులోని దుర్గానగర్‌లో ఆదివారం గణపతి దుర్గామల్లేశ్వరస్వామి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోడూరు కృష్ణ, కర్రి గోపి, లాయర్ శ్రీను, ముకుంద, కొణతాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీ వెంకటరావుకు కమాండెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకటరావు

అనకాపల్లి టౌన్, మార్చి 3 : న్యాయ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వద్దాది వెంకటరావుకు కమాండెంట్ అవార్డు లభించింది. గుంటూరు మెడికల్ కాలేజిలో శనివారం జరిగిన ఏపీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును వెంకటరావు అందుకున్నారు. ఏపీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె.సుదర్శనరెడ్డి, ఏపీ హైకోర్టు అడ్వకేట్ జ్యూడిషియల్ సుబ్రహ్మణ్యం శ్రీరామ్ చేతుల మీదుగా వెంకటరావు అవార్డు అందుకున్నారు. అనకాపల్లికి చెందిన అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వద్దాది వెంకటరావుకు ఈ అవార్డు దక్కడంతో పోలీస్ ఉన్నతాధికారులు, అనకాపల్లి బార్ అసోసియేషన్ కార్యదర్శి సూరా శ్రీనివాస్, న్యాయవాదులు అభినందించారు.

'అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలి'

అనకాపల్లి టౌన్, మార్చి 3 : ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిని ఎన్నుకోవాలని నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ ఓటర్లకు పిలుపునిచ్చారు. నైస్‌మ్యాన్ పవర్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. నా ఒక్క ఓటుతోనే ఏమౌతుందిలే అనే నిర్లక్ష్యాన్ని ఓటర్లు విడనాడాలని విజ్ఞప్తి చేశారు. ఓటు అనే రెండు అక్షరాలకు దేశ పరిపాలన గతిని, దశ దిశను మార్చే శక్తి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు బి. నేహా తదితరులు పాల్గొన్నారు.

మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి విరాళం

పరవాడ, మార్చి 3 : రావాడ పంచాయతీ పరిధి జల్లెలపాలెంలో గల మరిడిమాంబ నూతన ఆలయ నిర్మాణానికి గనిశెట్టి నూకరాజు ఇచ్చిన రూ.30వేలు విరాళాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న ఆదివారం కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిశెట్టి మాణిక్యం, మేడిశెట్టి సోమునాయుడు, గురువునాయుడు, పితాని శ్రీనివాస్, మోటూరు విజయ్, పొలవరపు నాగరాజు పాల్గొన్నారు.


టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

తుమ్మపాల, మార్చి 3: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం తుమ్మపాలలో గౌరీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. తుమ్మపాల, మార్టూరు, మామిడిపాలెం తదితర గ్రామాల నుంచి 378 మంది విద్యార్థులు పోటీ పరీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఆడారి నారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో సంఘం నాయకులు ఆళ్ల గోవిందరావు, రాపేటి సూర్యప్రకాశ్, కె. జోగఅప్పారావు, పీలా నారాయణ, బీకేవీ గోవిందరావు, కె. నరసింగరావు, ఆడారి గోవిందరావు పాల్గొన్నారు.

టీడీపీ బీసీ మహా సభను విజయవంతం చేయండి

రాంబిల్లి, మార్చి 3 : ఈనెల 5న మంగళగిరి నిర్వహిస్తున్న టీడీపీ బీసీ మహాసభను విజయవంతం చేయాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కశిరెడ్డి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఇక్కడ బీసీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం, రక్షణే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలం తాతబాబు, సీహెచ్ సత్యనారాయణ, చెల్లూరి దేముడు, మంగరాజు, నాగేష్ పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



అభయాంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సబ్బవరం, మార్చి 3: మండలంలోని గొటివాడలో అభయాంజనేయస్వామి 9వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వడిశల లక్ష్మణ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు వరసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6వేలు, రూ.4 వేలు నగదు బహుమతులు అందజేశారు.

క్రైం... crime news

సాయినగర్ కాలనీలో చోరీ



అగంతకులు పగలుగొట్టిన బీరువా

అనకాపల్లి టౌన్, మార్చి 3: పట్టణానికి ఆనుకుని ఉన్న కొత్తూరు పంచాయతీ పరిధిలోని సాయినగర్‌కాలనీలో జరిగిన చోరీపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. సాయినగర్‌కాలనీలో నివాసముంటున్న ఎస్. నాగేశ్వరరావు దంపతులు గత నెల 23వ తేదీన విశాఖలోని కుమారుడు ఇంటికి వెళ్లారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని అగంతకులు ఇంటి తలుపుల గడియను తొలగించి లోపలకి ప్రవేశించి బీరువాలోని రెండు తులాల బంగారం వస్తువులు, 50 కిలోల వెండి వస్తువులను అపహరించుకుపోయారు. శనివారం ఉదయం తలుపు గడియలు తొలగించి ఉండడాన్ని గమనించిన స్థానికులు నాగేశ్వరరావుకు సమాచారమివ్వడంతో రాత్రి వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్‌టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించింది. అగంతకుల వేలిముద్రలను క్లూస్ బృందం సేకరించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహ్మద్ అలీ తెలిపారు.

17 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 3: మండలంలో వేర్వేరు చోట్ల 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. గొర్లివానిపాలెంలో నరవ రామునాయుడు పాన్‌షాపులో ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం దాడి చేసినట్టు ఆయన చెప్పారు. పాన్‌షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అలాగే బొద్దపువానిపాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి బాలాజీ 12 మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్తుండగా ఆదివారం పట్టుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. అతని నుంచి 12 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు

» 500 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

పాయకరావుపేట రూరల్, మార్చి3: మండలంలోని ఈదటం గ్రామం శివారులో ఆదివారం సారా బట్టీలపై పోలీసులు దాడులు చేసి సుమారు 500 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు. అలాగే సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 3 : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన వాసుపల్లి అమ్మోరమ్మ ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 12 మద్యం క్వార్టర్ బాటిళ్లను కొనుగోలు చేసి ఆదివారం రాత్రి ఇంటికి తీసుకువెళుతుండగా ఎస్ఐ మల్లేశ్వరరావు పట్టుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

42 టేకు దుంగలు స్వాధీనం



అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

నర్సీపట్నం, మార్చి 3 : నాతవరం మండలం చమ్మచింత నుంచి తునికి అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల ఒకటో తేదీన రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో 42 టేకు దుంగలను రెండు బొలేరో వాహనాల్లో వేసి అక్రమంగా తరలిస్తుండగా, చమ్మచింత వద్ద స్వాధీనం చేసుకొని నర్సీపట్నం కలప డిపోకు తరలించినట్టు నాతవరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మహేష్‌గిరి ఆదివారం తెలిపారు. ఈ కలప విలువ రూ.1.5 లక్షలు ఉంటుందని వివరించారు. ఈ ఘటనలో తుని సమీపం పాల్తేరు గ్రామానికి చెందిన గరికిన నాగ శివ, కోడ మనోజ్‌లపై కేసు నమోదు, వ్యాన్లు సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ దాడుల్లో ఫారెస్ట్ గార్డు గీతా మాధురి పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన ప్రభుత్వం రావాలి

» జనసైనికుల బూత్ కమిటీ సమావేశంలో కొణతాల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మార్చి 3: ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ-జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన జనసేన పార్టీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనసేన పార్టీ బలోపేతానికి జనసైనికులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణను నిలిపివేయగల శక్తి ఒక్క పవన్‌కల్యాణ్‌కే మాత్రమే ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులు తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ప్రభుత్వంలోనే పూర్తవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలంటే ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా విశేషంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్, అధికార ప్రతినిధి తోట సత్యనారాయణ పాల్గొన్నారు.

సరుగుడు పాతకాలనీలో తాగునీటి కష్టాలు

ఇరవై రోజులుగా పనిచేయని నీటి పథకం మోటారు

బిందెలతో మోసుకుంటూ అవస్థలు పడుతున్న నివాసితులు



పాతకాలనీలో ఉత్సవ విగ్రహంలా ఉన్న తాగునీటి ట్యాంకు

నాతవరం, మార్చి 3 : మండలంలోని సరుగుడు పాతకాలనీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడున్న నీటి పథకానికి చెందిన ట్యాంకు మోటారు పాడవ్వడంతో ఇరవై రోజులుగా ఈ సమస్య తలెత్తినట్టు చెపుతున్నారు. అయినప్పటికీ కన్నెత్తి చూసేవారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత్యంతరం లేక దూర ప్రాంతానికి వెళ్లి బిందెలతో నీళ్లు మోసుకుని వస్తున్నామని మహిళలు వాపోతున్నారు. ఇళ్లలో వాడుకకు అవసరమైనన్ని నీరు మోసుకునే పరిస్థితి లేకపోవడంతో సర్దుకు పోతున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేపట్టి తమ నీటి కష్టాలు తీర్చాలని వారంతా కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

అధ్వాన రోడ్లతో అవస్థలు

» రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు

» పట్టించుకోని పాలకులు, అధికారులు



పంచదార్ల నుంచి రాజుకోడూరు వెళ్లే రోడ్డు దుస్థితి



సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డు దుస్థితి

రాంబిల్లి, మార్చి 3: మండలంలోని రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. నాలుగున్నరేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో రోడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. కొన్ని రోడ్లు గోతులమయమై రాళ్లు తేలిపోయి మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. దీంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి రోడ్డు, జంగాలపాలెం జంక్షన్ నుంచి అప్పారాయుడుపాలెం రోడ్డు, రాంబిల్లి-వెంకటాపురం నేవీ రోడ్డులో రాజుకోడూరు జంక్షన్ నుంచి పంచదార్ల వెళ్లే రోడ్డు, కృష్ణంపాలెం జంక్షన్ నుంచి కిలోమీటరు దూరంలో ఉన్న గ్రామంలోకి వెళ్లే రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రోడ్లు పొడవునా అడుగడుగునా భారీగా గోతులు ఏర్పడడంతో ప్రమాదాలకు నిలయంగా తయారయ్యాయి. వర్షాలు పడినప్పుడల్లా ఈ రోడ్లపై ఏర్పడిన గోతుల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సమస్యలను అధికారులకు చెప్పుకోవడమే తప్ప పరిష్కారానికి నోచుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పూర్తిగా దెబ్బతిన్న అప్పారాయుడుపాలెం రోడ్డు



రాళ్లు తేలిన కృష్ణంపాలెం రోడ్డు

కనీస సౌకర్యాలు లేకుండా టిడ్కో గృహాలు పంపిణీ

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్



చింతకాయల విజయ్

నర్సీపట్నం, మార్చి 3: రాజకీయ లబ్ధి కోసం వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలలో కనీస మౌలిక సదుపాయలు కల్పించకుండా లబ్ధిదారులకు పంపిణీ చేస్తుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. టిడ్కో లబ్ధిదారుల తరపున గడచిన నాలుగున్నర సంవత్సరాలుగా మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. టీడీపీ హయాంలో పదిహేను నెలల్లో 80 శాతం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ఎన్నికల ముందు ఉచితంగా ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన వైసీపీ నాయకులు, ఇళ్లు ఇవ్వక పోగా లబ్ధిదారులపై రూ.70వేలు వడ్డీ భారం మోపారని వాపోయారు. దీంతో ఇటు అద్దెలు కట్టుకోలేక, అటు వాయిదాలు చెల్లించుకోలేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాజకీయ లబ్ధి కోసం ఎన్నికలకు నెల రోజులు ముందు నీరు, విద్యుత్, రోడ్లు కనీస సౌకర్యాలు లేకుండా లబ్ధిదారులకు ఇంటి తాళాలు ఇచ్చి వైసీపీ ప్రభుత్వం చేతులు దులుపేసుకుంటుందని విమర్శించారు. 46 రోజుల్లో వైసీపీ ఇంటికి పోవడం ఖాయమని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని సదుపాయలతో ఇళ్లు అప్పగిస్తామని విజయ్ స్పష్టం చేశారు.

బీసీ సదస్సును విజయవంతం చేయాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, మార్చి 3 : ఈనెల ఐదో తేదీన మంగళగిరిలో జరిగే బీసీ సదస్సును విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు పిలుపునిచ్చారు. రింగురోడ్డులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన బీసీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ హయాంలో బీసీలకు అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేసిందని విమర్శించారు. సుమారు 30కి పైగా బీసీ పథకాలు రద్దు చేయడమే కాకుండా బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి బీసీ ద్రోహిగా జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తున్నారని తెలుగుదేశంపార్టీలో ప్రముఖంగా ఉన్న బీసీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, బీసీ నేత కొల్లు రవీంద్రలను జైలుకు పంపారన్నారు. మాజీ మంత్రులు సీహెచ్. అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై బీసీ రక్షణ చట్టాన్ని మినీ మేనిఫెస్టోలో పెట్టడం జరిగిందని, అధికారంలోకి రాగానే వెంటనే అమలు చేస్తామన్నారు.

ఈనెల ఐదున జరిగే బీసీ డిక్లరేషన్‌కు జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి బీసీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, గుడాల సత్యనారాయణ, గుర్రం నూకరాజు, వాయిబోయిన రమణ, ఆర్. రమణ పాల్గొన్నారు.

విశాఖలో అదృశ్యమై.. జొన్నాడలో శవమయ్యాడు



ఆలమూరు మండలం జొన్నాడ సమీపాన గోదావరిలో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన పోతిన సాయి (పాత చిత్రం)

కొమ్మాది, మార్చి 3 : మధురవాడలోని బక్కన్నపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలో హత్యకు గురవ్వడం స్థానికంగా సంచలనం రేపింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బక్కన్నపాలెం గ్రామానికి చెందిన పోతిన సాయి పవన్ ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఫొటో షూట్‌లు చేస్తుంటాడు. తండ్రి శ్రీను ఆటోడ్రైవర్ కాగా తల్లి రమణమ్మ కార్‌షెడ్ జంక్షన్‌లో ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా పెద్దవాడు సాయి పవన్ (22) ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఫొటోషూట్ చేస్తుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన షణ్ముఖ తేజ తాను కూడా ఫొటో షూట్ చేస్తుంటానని, ఫోన్ ద్వారా సాయిని పరిచయం చేసుకున్నాడు. షణ్ముఖ తేజ, సాయి వద్ద రూ. 15 లక్షల విలువైన హైటెక్నాలజీ కెమెరాలు ఉన్నట్టు తెలుసుకున్నాడు.వాటిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో సాయికి ఫోన్ చేసి రావులపాలెంలో పెద్ద ఈవెంట్ ఉందని, నీ దగ్గర ఉన్న కెమెరాలతో ఇద్దరం కలిసి ఈవెంట్ చేస్తే మంచి డబ్బులు వస్తాయని నమ్మబలికాడు. దీంతో సాయి గతనెల 26న విశాఖ నుంచి రైలులో బయల్దేరి రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడి నుంచి షణ్ముఖ తేజ కారును అద్దెకు తీసుకొచ్చి దారి మధ్యలో హత్య చేసి జొన్నాడ వద్ద గోదావరి ఇసుక తిన్నెల్లో పాతిపెట్టారు. రూ.15 లక్షల విలువ చేసే కెమెరాలు, ఇతర సామగ్రిని పట్టుకుని పారిపోయారు. అయితే ముందుగా తనకు ఏదో ఆపద జరుగుతుందని గమనించిన సాయి కారు నెంబరును తన తల్లికి వాట్సాప్ చేశారు. తన నెంబరు పని చేయకపోతే వేరే నెంబరుకు ఫోన్ చేయమని తేజ నెంబరు పంపించాడు. తన కుమారుడు ఆపదలో ఉన్నాడనే విషయాన్ని తల్లి తెలుసుకోలేకపోయింది. ప్రతిరోజూ మాట్లాడేవాడు రెండు రోజులుగా ఫోను చేయలేదని అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న సమాచారంతో గతనెల 29న పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్య కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాయి పంపించిన కారు నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా నిందితుడు రావులపాలెంకు చెందిన షణ్ముఖ తేజగా గుర్తించారు. సాయి కుటుంబ సభ్యులు పీఎం పాలెం సీఐ రామకృష్ణ సూచన మేరకు రావులపాలెం వెళ్లగా అప్పటికే షణ్ముఖ పరారీలో ఉన్నాడు. అతని తల్లిదండ్రులను పోలీసులు విచారించగా సాయిని హత్య చేసి, కెమెరాలను పైన గదిలో పెట్టినట్టు చెప్పడంతో పోలీసులు గది తాళాలు పగలకొట్టి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. కెమెరాలను షణ్ముఖ తండ్రిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చారు.

అమ్మాయితో చాటింగ్ చేయించి, పట్టుకున్నారు

నిందితుడు షణ్ముఖ తేజ మొదటి నంబరు స్విచ్ఛాఫ్‌లో ఉండగా రెండవ నంబరును పోలీసులు ట్రేస్ చేసి అన్నవరంలో ఉన్నట్టు గుర్తించారు. అక్కడికి వెళ్లేసరికి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు శనివారం షణ్ముఖ తేజకు నగరంలోని కంచరపాలెంకు చెందిన అమ్మాయికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఉన్నట్టు గుర్తించి ఆ అమ్మాయిని, ఆమె తల్లిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆమెతో షణ్ముఖకు ఫోన్‌లో చాటింగ్ చేయించారు. ఈమె మెసేజ్‌కు షణ్ముఖ స్పందించడంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. విచారణ అనంతరం షణ్ముఖ ఇచ్చిన సమాచారం మేరకు సాయిని చంపి పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులు గుర్తించారు. అనంతరం పవన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే ఈ కేసులో కేవలం కెమెరాల కోసమే షణ్ముఖ ఇంతకు తెగించాడా లేదా మరో కోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబ సభ్యుల రోదన

వారం రోజుల క్రితం అదృశ్యమైన కుమారుడు సాయి మృతదేహం చూసి తల్లిదండ్రులు శ్రీను, రమణమ్మ బోరున విలపించారు. తమతో ఎంతో సరదాగా ఉండే సాయిని దారుణంగా చంపేశారంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కాగా ఈ కేసులో కారు డ్రైవర్ కడియం మండలం పొట్టిలంకకు చెందిన వినోద్ పాత్ర ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, మార్చి 3 : కృష్ణాపురంలోని నృసింహవనంలో కొలువుదీరిన సూర్యనారాయణస్వామి దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. వేకువ జాము నుంచే అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని, సూర్య నమస్కారాలు చేశారు. కొందరు ఆలయ ఆవరణలో దీపారాధన చేసి చిక్కుడు కాయల రథాలపై పాయసాన్ని వండి నివేదించారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆ ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. కాగా భక్తులు అధికంగా వస్తున్నప్పటికీ దేవస్థానం ఇక్కడ ఒక అర్చకుడ్ని కూడా ఏర్పాటు చేయకపోగా కనీసం తాగునీరు, వసతి సౌకర్యాలు కూడా కల్పించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈవో

ఏడు, ఎనిమిది తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలు



విలేకరులతో మాట్లాడుతున్న గోవింద్

అనకాపల్లి టౌన్, మార్చి 3: స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో ఈనెల ఏడు, ఎనిమిది తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల కన్వీనర్ యల్లపు గోవింద్ చెప్పారు. దిబ్బవీధి రామాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీలకు ఎనిమిది జట్లు హాజరవుతున్నాయన్నారు. ఫ్లడ్‌లైట్‌ల్లో లీక్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు మొదటి బహుమతి కింద రూ.15వేలు, రెండో బహుమతిరూ. 10వేలు, మూడో బహుమతి కింద రూ. 6వేలు, నాల్గో బహుమతి కింద రూ. 4వేలు, జ్ఞాపికలను ఇవ్వనున్నామన్నారు. క్రీడాకారులకు వసతి, భోజన సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీలకు ఆర్గనైజర్లుగా బుద్ద శివ, విల్లూరి ప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో వాలీబాల్ క్రీడాకారులు పీలా రమణారావు, పోలిమేర శ్రీను, కాండ్రేగుల జయరాం, సీతారామదేవస్థానం చైర్మన్ దాడి భాస్కరరావు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ గృహ నిర్బంధం



జిల్లా అధ్యక్షుడు తట్టా కృష్ణను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

కశింకోట, మార్చి 3 : సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఆది వారం విశాఖపట్నం లో మహాగర్జన సభ ఏర్పాటు చేశారు. ఆ సభకు వెళ్లకుండా సమగ్ర శిక్ష ఉద్యో గుల సంఘం అధ్యక్షుడు తట్టా కృష్ణను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కనీసం తమ న్యాయమైన డిమాండ్లపై మాట్లాడడానికి స్వేచ్ఛ ఇవ్వకుండా చేయడం సరైన విధానం కాదని సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు పూడి వెంకట్రావు తెలిపారు. 22 రోజులపాటు సమ్మె చేస్తే తమ డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చి కనీసం ఒక్క డిమాండ్ కూడా నేటికీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం మేల్కొని తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

కదంతొక్కిన ఉక్కు కార్మికులు

» స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహా పాదయాత్ర

» కూర్మన్నపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ

» పాదయాత్రలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు

కూర్మన్నపాలెం, మార్చి 3: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉక్కు కార్మికులు ఆదివారం నగరంలో కదం తొక్కారు. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరం నుంచి ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో మహా పాదయాత్రను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర వడ్లపూడి, శ్రీనగర్, చినగంట్యాడ, గాజువాక, ఆటోనగర్, షీలానగర్ మీదుగా జీవీఎంసీ కార్యాలయం సమీపంలోని గాంధీ విగ్రహం వరకు సాగింది. మహా పాదయాత్రలో మహిళలు, విద్యార్థి, దళిత, ప్రజా, నిర్వాసిత, ఉద్యోగ సంఘాలు, వామపక్ష, టీడీపీ, వైసీపీ, జనసేన, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని నినాదాలతో హోరెత్తించారు.

మద్దతు ప్రకటించిన టీడీపీ

ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా నిర్వహించిన పాదయాత్రలో కార్మిక సంఘాల నాయకులతో పాటు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, నేతలు శ్రీభరత్, బొండా జగన్ పాదయాత్రలో పాల్గొన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన నిరసనలకు పార్టీ ఆదినుంచీ అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మించిన ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోమన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఉక్కు పరిరక్షణకు వైసీపీ కట్టుబడి ఉందని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జనసేన నాయకులు కోనతాతారావు మాట్లాడుతూ తమ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దీక్షలకు సంఘీభావం తెలిపారన్నారు. ఉక్కు పరిరక్షణకు జనసేన అండగా ఉంటుందన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు జేవీ సత్యనారాయణమూర్తి, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్‌లు మాట్లాడుతూ ఉక్కును ముంచేలా కేంద్రం విధానాలు ఉన్నాయన్నారు. బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలు పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలిపాయన్నారు. ప్రభుత్వరంగాలను తాబేదార్లకు అప్పగించాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా అప్పుల ఊబిలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ప్రైవేటీకరణకు పూనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు.

యాత్రకు భారీ స్పందన

ఉక్కు కార్మికులు నిర్వహించిన మహా పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నగరవాసులు కూడా పాదయాత్రలో పాల్గొన్నారు. ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏసీపీలు త్రినాథ్, రాజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో దువ్వాడ, స్టీలుప్లాంట్, పెదగంట్యాడ స్టేషన్లకు చెందిన పోలీసులు ఉక్కు కార్మికులతో పాటు తరలివెళ్లారు. పాదయాత్రలో జనసేన నాయకులు కోన తాతారావు, వామపక్ష నాయకులు జేవీ సత్యనారాయణమూర్తి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు సీహెచ్ నరసింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరాం, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, జెర్రిపోతుల ముత్యాలు, నీరుకొండ రామచంద్రరావు, అడుసుమిల్లి దీప్తి, గంధం వెంకటరావు, సన్యాసిరావు, బొడ్డు పైడిరాజు, మస్తానప్ప, విళ్ల రామ్మోహన్ కుమార్, నమ్మి సింహాద్రి, దొమ్మేటి అప్పారావు, పులి వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు.

21 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

నర్సీపట్నం మార్చి 3 : పట్టణంలోని ఐదు రోడ్ల కూడలిలో గల ఒక దుకాణంలో అనధికారికంగా నిల్వ ఉంచిన 21 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. దీనిపై ఆదివారం సీఐ కాంతి కుమార్ దుకాణం యజమాని బి.శ్రీనివాసుపై కేసు నమోదు చేశారు.

తాకట్టుకు ప్రజల ఆస్తులే మిగిలాయి

- అమరావతిలోని రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టేశారు
- శ్రీలంకలో కూడా ఇంత దారుణ పరిస్థితి లేదు
- వైసీపీ ప్రభుత్వ తీరుపై టీడీపీ 'చోడవరం' ఇన్‌చార్జి 'బత్తుల' ఆగ్రహం



బుచ్చెయ్యపేట, మార్చి 3 : వైసీపీ ప్రభుత్వం తాకట్టు పెట్టేందుకు ఇక రాష్ట్రంలో ప్రజల ఆస్తులే మిగిలాయని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు ఎద్దేవా చేశారు. మండలంలోని వడ్డాది పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిన్నటి వరకు ప్రభుత్వ భవనాలు తాకట్టు పెట్టేశారని, ఇప్పుడు ఏకంగా రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టు పెట్టారని మండిపడ్డారు. అప్పుల ఊబిలో మునిగిపోయిన శ్రీలంక కూడా తమ పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టలేదని, కానీ ఇది ఒక్క జగనన్నకు మాత్రమే సాధ్యమనేలా అన్నింటినీ తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరలేపిన జగన్, రాష్ట్రానికి ఒక్క రాజధాని కూడా లేకుండా చేశార న్నారు. చివరకు ఉన్న రాజధానిలోని రాష్ట్ర సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టి దివాళాకోరుతనాన్ని జగన్ చాటిచెప్పారని విమర్శించారు. విశాఖలో 13 ప్రభుత్వ భవనాలు, కాలేజీలు తాకట్టు పెట్టి రూ.25వేల కోట్లు అప్పులు తెచ్చారని ఆరోపించారు. 58 నెలల జగన్ పాలనలో రూ.12 లక్షల కోట్ల అప్పు తెచ్చి ఏం చేశారని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలకు రూ.2లక్షల కోట్లు ఖర్చు చేయగా, మిగిలినదంతా ఏమైందని నిలదీశారు. జగనే అధికారంలో ఉంటే మన ప్రైవేటు ఆస్తులను, భూముల్ని తాకట్టు పెట్టి లక్షల కోట్లు అప్పు తెచ్చి లూటీ చేసే ప్రమాదం పొంచి ఉందని తాతయ్యబాబు హెచ్చరించారు. టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు రూ.68 వేల కోట్లతో పెండింగ్ ప్రాజెక్టులను పరుగులు పెట్టించారని గుర్తుచేశారు. పోలవరాన్ని చంద్రబాబు 72 శాతం పూర్తి చేయిస్తే, జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఇరిగేషన్‌ను స్వర్ణయుగంగా మార్చగా, జగన్ నిర్వీర్యం చేసి రైతాంగానికి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలంతా ఈ ప్రభుత్వ అరాచకాలపై ఆలోచించాల్సిన సమ యం ఆసన్నమైందన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టి, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా మోదకొండమ్మ తీర్థం



మోదకొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల రూరల్ మార్చి 3 : మండలంలోని ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఆదివారం మోదకొండమ్మ తీర్థం అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి ఘటాలతో పాటు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఇందులో భాగంగా మధ్యాహ్నం ఏర్పాటైన కబడ్డీ, ఎడ్లబండ్ల పరుగు పందేలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు, వర్తక సంఘం ప్రతినిధులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీల విలీనం?

... 5వ పేజీ తరువాయి

క్రమంలో ఎంపికచేసిన పాఠశాలలను నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) బృందం పరిశీలించనుంది. ఈ బృందం ఆదివారం నగరానికి చేరుకుంది. సోమవారం నుంచి విశాఖ జిల్లాలోని పది మండలాల్లో ఒక్కో పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించనుంది. ఆయా పాఠశాలల్లో వసతులు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాలను బృంద సభ్యులు తనిఖీ చేయనున్నారు.

ఎందుకీ వివక్ష

... 5వ పేజీ తరువాయి

అన్నింటా ముందంజలో ఉన్న బుచ్చెయ్యపేట పీఏసీఎస్‌కి మౌలిక సదుపాయాల కల్పనలో డీసీసీబీ అధికారులు వివక్ష చూపడాన్ని రైతులు ఆక్షేపిస్తున్నారు. కావాలనే బుచ్చెయ్యపేట పీఏసీఎస్‌కి మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా దెబ్బతిన్న భవనంలో పీఏసీఎస్ కొనసాగించడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సొంత స్థలం ఉండి కూడా నూతన భవనాన్ని ఎందుకు నిర్మించడం లేదో తెలపాలని రైతులు డీసీసీబీ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బుచ్చెయ్యపేట పీఏసీఎస్‌కి నూతన భవనం మంజూరుకు కృషి చేయాలని సభ్య రైతులు కోరుతున్నారు.

తాగునీటి కష్టాలు తప్పవా?

... 5వ పేజీ తరువాయి

మంచినీటి పథకాలు పని చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెలలో జిల్లాలోని అన్ని మండలాల్లో తాగునీటి వనరుల పరిస్థితిని తెలుసుకొని, అవసరం మేరకు రక్షిత మంచినీటి పథకాలకు, బోర్లకు మరమ్మతులు చేపడతామని ఆయన వెల్లడించారు.

మూలకు చేరిన మంచినీటి బోరు

రాంబిల్లి: మండలంలోని కొండవారపాలెంలో మంచినీటి బోరు మరమ్మతులకు గురై ఏడాది గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామస్థులకు తాగునీటి ఇబ్బం దులు తప్పడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి బోరుకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

పాఠశాల అప్‌గ్రేడ్ ఆశలు ఆవిరి!

... 5వ పేజీ తరువాయి

చదువుకోవాలంటే రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని అంటున్నారు. ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు విశాలమైన క్రీడా ప్రాంగణం ఉంది. అలాగే అదనపు తరగతి గదులు నిర్మించడానికి వీలు కూడా ఉంది. ఇది జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ కావడానికి అన్ని సదుపాయాలు ఉన్నాయి.

2019లో టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు 2019లో ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారు. అయితే అప్పట్లో ఎన్నికలు రావడంతో అది కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. దీని వల్ల కళాశాలగా అప్‌గ్రేడ్ కావలసిన రెసిడెన్సియల్ పాఠశాల ఎటువంటి పురోగతి లేకుండా ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

చెందాడు. దీనికి సంబంధించి కృష్ణాదేవిపేట ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర తెలిపిన వివరాలిలావున్నాయి. ఏఎల్‌పురం గ్రామానికి చెందిన దుంగల అప్పలనాయుడు(70) శనివారం రాత్రి కొండగోకిరిలో గల చేనుపాకల నుంచి తన పనులు ముగించుకుని గ్రామానికి నడిచి వస్తుండగా ఇదే మార్గంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న అదే గ్రామానికి చెందిన ముప్పల సింహాద్రి ఢీకొన్నాడు. దీంతో అప్పలనాయుడు తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సింహాద్రికి పలుచోట్ల గాయాలయ్యాయి. వారిద్దర్నీ నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పలనాయుడు పరిస్థితి విషమించడంతో విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను ఆదివారం మృతి చెందాడు. మృతుడి తమ్ముడు చినఅప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఉపేంద్ర తెలిపారు.

గుంతల మయం.. ప్రయాణాలకు భయం..!

- అధ్వానంగా మాడుగుల మండలంలోని ప్రధాన రహదారులు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఎం.కోటపాడు- కేజేపురం జంక్షన్ల మధ్య దుస్థితి



కేజేపురం జంక్షన్ సమీపంలో ఛిద్రంగా మారిన రహదారి

మాడుగుల రూరల్, మార్చి 3 : ఏళ్ల గడుస్తున్నా ప్రధాన రహదారులపై వాహనదారులకు పాట్లు తప్పడం లేదు. ఎక్కడికక్కడ గోతులు, కొన్ని చోట్ల రాళ్లు తేలి కనిపిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. ఫలితంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటూ పలువురు గాయాలకు గురవుతున్నారు. ప్రధానంగా మాడుగుల మండలంలోని రహదారుల దుస్థితి మరీ దారుణంగా ఉంది. వడ్డాది- పాడేరు ఆర్అండ్‌బీ రోడ్డులో భాగమైన కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం, ముకుందపురం గ్రామాల వద్ద రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది.

మూడు జిల్లాల ప్రజలు రాకపోకలు

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల వారికి అల్లూరి సీతారామరాజు మన్యం ప్రాంతాలకు ఈ రోడ్డు మార్గమే ప్రధానం. అంతేకాకుండా నియోజకవర్గ కేంద్రమైన మాడుగుల వాసులకు ఇదే ఆధారం. దీంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వడ్డాది జంక్షన్ నుంచి ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు సుమారు ఆరుకిలో మీటర్లు దూరంలో ఉన్న ముకుందపురం, కేజేపురం జంక్షన్, ఎం.కోటపాడు, ఎం.కె.వల్లాపురం దాటుకుని ఘాట్‌రోడ్డు జంక్షన్‌కి చేరుకోవాలి. అక్కడి నుంచి మాడుగులకు మరో నాలుగు కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు కాస్తా పర్వాలేదు అనిపించినా ఆ ఆరు కిలోమీటర్ల ప్రయాణానికి ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నామని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ప్రయాణంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడక తప్పదని అంటున్నారు. రోడ్ల దుస్థితి ఇంతలా ఉన్నా అధికారులు పట్టించుకోక పోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

తాగునీటి కోసం బి.కొట్నాబిల్లి మహిళల ఆందోళన

- గ్రామంలోని ట్యాంకు శిథిలావస్థకు చేరుకుందని ఆవేదన
- జల్ జీవన్ పథకంలో నీటి కష్టాలను తొలగించాలని వేడుకోలు



తాగు నీటి కోసం గ్రామంలో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

రావికమతం, మార్చి 3 : జల్ జీవన్ మిషన్ పథకంలో మండలంలోని పాత కొట్నాబిల్లికి తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ అక్కడి ఆదివాసీ మహిళలు ఆదివారం గ్రామంలోనే ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. టి.అర్జాపురం పంచాయతీ శివారు ఉన్న ఈ పి.కొట్నాబిల్లి గిరిజన గ్రామం. ఇక్కడ 80 ఆదివాసీ కుటుంబాలకు చెందిన 450 మంది వరకు జనాభా నివాసం ఉంటున్నారు. ఈ గ్రామంలో సుమారు 25 ఏళ్ళ క్రితం పది వేల లీటర్ల సామర్థ్యం గల రక్షిత మంచి నీటి పథకం ఉంది. ప్రస్తుతం ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. కనీసం ట్యాంకు శుభ్రపరిచేందుకు కూడా వీలులేని దుస్థితికి చేరిందని తెలిపారు. ఈ ట్యాంకులోకి మోటారు నుంచి నీరు ఎక్కితే కూలే ప్రమాదం ఉందని గ్రామానికి చెందిన నందుల పూర్ణ, పెండిల గౌరమ్మ, డేగల వరలక్ష్మి తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జల్ జీవన్ మిషన్ పథకంలో తమ గ్రామానికి తాగు నీటి సౌకర్యం కల్పించాలని ఆదివాసీ మహిళలంతా కోరారు.


'యువత రక్తదానానికి ముందుకు రావాలి'



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి

కె.కోటపాడు, మార్చి 3 : ఎ.కోడూరులో అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు మాట్లాడుతూ ఇటువంటి శిబిరాల్లో యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములై రక్తాన్ని దానం చేయాలని కోరారు. అమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. గ్రామ మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కింతాడలో ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ



కె.కోటపాడు, మార్చి 3 : మండలంలోని కింతాడ శివారు రామచంద్రపురంలో ఆంజనేయ విగ్రహాన్ని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ఇందులో భాగంగా గత మూడు రోజుల నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నూరు సూర్యనారాయణ, కె.కోటపాడు మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహమూర్తిలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వాహకులు అన్నసమారాధన జరిపారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా.. : ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం, మార్చి 3 : నియోజకవర్గంలో టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు జరిగిన అభివృద్ధి, వైసీపీ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా 2019 నుంచి 2024 వరకు చేపట్టిన అభివృద్ధిపై చర్చించేందుకు సిద్ధమా.. అని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆదివారం మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుకు సవాల్ విసిరారు. ఈ మేరకు విలేకరులకు ఆదివారం వీడియో సందేశాన్ని విడుదల చేశారు. 40 సంవత్సరాలలో అయ్యన్నపాత్రుడు చేయలేని అభివృద్ధి ఐదేళ్లలో తాము చేశామన్నారు. ఆరిలోవ రోడ్డు అభివృద్ధి పనులకు అనుమతులు సాధించానని, మాకవరపాలెంలో 630 పడకలతో మెడికల్ కళాశాల, నర్సీపట్నం మెయిన్‌రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ధి జరగలేదని విమర్శించడం కాదని, గ్రామాల్లోకి వెళ్లి చూస్తే తెలుస్తుందని వివరించారు.

మద్యం దుకాణం వాచ్‌మన్ మృతి

చోడవరం, మార్చి 3 : పట్టణ శివారు కొత్తూరు జంక్షన్ సమీపంలో గల మద్యం దుకాణం వద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఎడ్లవీధికి చెందిన సిరసపల్లి వెంకటరావు ఆదివారం మృతిచెందారు. శనివారం రాత్రి మద్యం దుకాణం వద్ద విధులకు వెళ్లిన ఆయన తెల్లవారు జామున విధులలో ఉండగానే గుండెపోటుతో కన్నుమూశారు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు.

నేడు తురువోలులో టీడీపీ సమావేశం

చీడికాడ, మార్చి 3 : మండలంలోని తురువోలులో టీడీపీ నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశంలో సోమవారం జరగనుందని పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతల చిన్నంనాయుడు, బొబ్బాది తాతారావు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ హాజరు కానున్నారన్నారు.

దివ్యాంగుల సమస్యలపై 'చలో అమరావతి'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సమాఖ్య సభ్యులు

రావికమతం మార్చి 3 : దివ్యాంగుల హక్కుల సాధనకు ఈనెల తొమ్మిదో తేదీన చేపట్టనున్న 'చలో అమరావతి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వికలాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు జి.రాము పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం రావికమతంలో ఆవిష్కరించి మాట్లాడారు. డిమాండ్లను పరిష్కరించుకునేందుకు దివ్యాంగులంతా తరలి రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు గంజి శ్రీను, అమరపల్లి రామజోగి నర్సింగరావు పాల్గొన్నారు.

నాతవరం మండల సమావేశం రేపు

నాతవరం, మార్చి 3 : ఇక్కడి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల ఐదో తేదీ మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జె.రాంబాబు తెలిపారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో పాటు ఆయా శాఖల అధికారులు హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

రైతులకు చెక్కులు పంపిణీ

రోలుగుంట, మార్చి 3 : ఇక్కడి హైస్కూల్ ఆవరణలో ఆది వారం రోలుగుంట, కొవ్వూరు, కె.నాయుడుపాలెం, నిండుగొండ, కొండపాలెం గ్రామాలకు చెందిన రైతులకు రాఘవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చెక్కులను పంపిణీ చేశారు. ట్రస్ట్ ఎండీ సూర్య ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు. వ్యవసాయం చేసే రైతులను మరింత ప్రోత్సహించేందుకు పెట్టుబడి నిమిత్తం ఈ సాయం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

బూరుగుపాలెంలో పూరిల్లు దగ్ధం

రావికమతం, మార్చి 3 : తట్టబంద పంచాయతీ శివారు బూరుగుపాలెం లో నమ్మి అప్పలనాయుడు పూరిల్లు ఆదివారం సాయంత్రం ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. దీంతో ఆ కుటుంబం నిరాశ్రయులుగా మారారు. కట్టుబట్టలతో మిగలడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సర్పంచ్ గోకివాడ రమణ బాధితులను పరామర్శించారు.

'రైతుల సంక్షేమానికి విశాఖ డెయిరీ విశేష కృషి'



జైతవరంలో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న బూడి, రమాకుమారి

చీడికాడ, మార్చి 3 : రైతులకు వ్యవసాయంపై వస్తున్న ఆదాయంతో పాటు అదనపు ఆదాయం కల్పిస్తున్న ఘనత విశాఖ డయిరీకే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. డెయిరీ నిధులతో మంచాలలో కాలువపై నిర్మించిన వంతెన, జైతవరంలో నిర్మించిన వాటర్‌ట్యాంకు, గ్రావెల్ రోడ్డు, బి.సింగవరంలో నిర్మించిన వంతెన, అప్పలరాజుపురంలో నిర్మించిన సైలేజ్ ప్లాంట్‌ను ఆదివారం విశాఖ డెయిరీ డైరెక్టర్ పిళ్లా రమాకుమారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమానికి డెయిరీ పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మి, విశాఖ డెయిరీ డైరెక్టర్లు శీరంరెడ్డి సూర్యనారాయణ, దాడి పవన్‌కుమార్, గేదెల సత్యనారాయణ, సుందరపు గంగాధర్, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, సర్పంచ్‌లు చుక్క అప్పలనాయుడు, కసిరెడ్డి రామకృష్ణ, ఈర్లె చైతన్య తదితరులు పాల్గొన్నారు.

'పోలియో రహిత సమాజమే అందరి లక్ష్యం కావాలి'



దేవరాపల్లి : తారువలో పిసిపాపకు పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ సీఎం బూడి



బుచ్చెయ్యపేట : తురకలపూడిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ



చోడవరం :గోవాడలో పోలియో చుక్కలు వేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు



రోలుగుంటలో ఎస్‌ఐ సురేష్ తన కుమారుడికి దగ్గరుండి పోలియో చుక్కలు వేయిస్తున్న దృశ్యం



గొలుగొండ : ఏఎల్‌పురంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ మణికుమారి

దేవరాపల్లి, మార్చి 3 : పోలియో రహిత సమాజ నిర్మాణమే అందరి లక్ష్యం కావాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని తారువ గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. దేవరాపల్లిలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఎంపీటీసీ కృష్ణమూర్తి, వైద్యాధికారిణి పూజిత మేఘన, వినకోట వైద్యాధికారులు జి.వెంకటేష్, రూప్‌చంద్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: మండలంలో పల్స్ పోలియోను విజయవంతంగా నిర్వహించారు. కేజేపురం పీహెచ్‌సీ పరిధిలో 95శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్య సిబ్బంది ఘాట్‌రోడ్డు జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపినప్పుడు అందులోని పిల్లలకు సైతం చుక్కలు వేశారు. వైద్యులు డాక్టర్ ప్రసాద్ పాత్రుడు, సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ : జిల్లాలోని ఐదేళ్లలోపు పిల్లలందరికీ శత శాతం పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా మలేరియా ఆఫీసర్ వరహాలు దొర తెలిపారు. జైతవరం పాఠశాలలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా ఎపిడమిక్ అధికారి సంతోష్‌తో కలిసి సందర్శించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అప్పలరాజుపురంలో ఎంపీపీ కురచా జయమ్మ, తురువోలులో జడ్పీటీసీ లాలం శారదావరలక్ష్మిలతో పాటు ఆయా పంచాయతీ సర్పంచ్‌లు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు.

కె.కోటపాడు : గ్రామ గ్రామాన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎల్‌పీపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సన్యాసిరావులు మాట్లాడుతూ మండలంలో 95 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు చెప్పారు.

చోడవరం : పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మండలంలో విజయవంతంగా నిర్వహించారు. గోవాడలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్ ప్రారంభించారు. గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి, కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యాధికారి వినయ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : తురకలపూడిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, తురకలపూడి పీహెచ్‌సీల పరిధిలో 94 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు ఆయా వైద్యులు తెలిపారు. జడ్పీటీసీ దొండా రాంబాబు, సర్పంచ్ గోవింద, ఉప సర్పంచ్ వెంకటరమణ, కోరుకొండ అప్పలనాయుడు, దొండా నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రోలుగుంట : పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో భాగంగా రోలుగుంట ఎంపీపీ పాఠశాలలో ఎస్‌ఐ సురేష్ తన కుమారుడితో పాటు పలువురు చిన్నపిల్లలకు పోలియో చుక్కలను వేసి ప్రారంభించారు. అలాగే, మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమం విజయవంతమైంది. పీహెచ్‌సీల వైద్యులతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతం : పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మండలంలో విజయవంతంగా నిర్వహించారు. పీహెచ్‌సీల పరిధిలోని వైద్య సిబ్బంది ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వైద్యులతో పాటు సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నం అర్బన్ : మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతమైంది. మొత్తం 46 కేంద్రాలలో తొంభైశాతం మంది పిల్లలకు చుక్కలు వేశారు. యరకన్నపాలెంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేములపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ టి.సుమ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : గునుపూడి, నాతవరం పీహెచ్‌సీలలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైంది. నాతవరంలో చుక్కలు వేసే కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రశాంతి పరిశీలించారు. నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, డాక్టర్ అనూష, డాక్టర్ చక్రధర్, హెల్త్‌సూపర్‌వైజర్ సిహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గొలుగొండ : మండల కేంద్రం గొలుగొండ, చీడిగుమ్మల పీహెచ్‌సీల పరిధిలో పల్స్‌పోలియోను విజయవంతంగా నిర్వహించారు. చీడిగుమ్మలలో తొలుత జడ్పీటీసీ సుర్ల గిరిబాబు పిల్లలకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ శ్యామ్, డాక్టర్ ధనంజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పీహెచ్‌సీ పరిధిలోని ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, సీహెచ్.నాగాపురం, చోద్యం, కొంగసింగి తదితర గ్రామాల్లో పల్స్‌పోలియో విజయవంతమైంది. ఏఎల్‌పురం మండల పరిషత్ పాఠశాలలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, సర్పంచ్ లోచల సుజాత పిల్లలకు చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్‌లు పందిరి సత్యంనాయుడు, యలమంచిలి రఘురామ్, పీహెచ్‌సీ వైద్యాధికారులు హరిప్రవీణ్, గాయత్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం : పల్స్ పోలియో మండలంలో విజయవంతమైంది. బూరుగుపాలెంలో ఎంపీపీ సత్యనారాయణ, రాచపల్లిలో జడ్పీటీసీ పెట్ల సత్యవేణి పిల్లలకు చుక్కలను వేసి ప్రారంభించారు. వైద్యాధికారిణి డాక్టర్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.